# తెలుగు యాంకర్లు

**సుమ**: తెలుగమ్మాయి కాదు. పదహారణాల తెలుగు పిల్లలా ఉంటుంది. తెలుగు మేస్టారమ్మాయిలా భాషోచ్ఛారణ చేస్తుంది. ప్రముఖ సినీనటుడు రాజీవ్ కనకాలకు ఇల్లాలు, ఓ బిడ్డ తల్లి. అప్పుడే టెన్త్ ప్యాసై కొత్తగా కాలేజిలో చేరిన అమ్మాయిలా చలాకీగా ఉంటుంది. అల్లరి చేస్తే ముచ్చటగా ఉంటుంది. వ్యవహారం హుందాగా ఉంటుంది. నొప్పింపక తానొవ్వక కార్యక్రమాల్ని నిర్వహించే ఈమె సమయస్ఫూర్తి మెచ్చుకోతగ్గది. తమ ప్రత్యేకతను నిలుపుకుంటూ ఈమెను అనుసరించడం కాబోయే యాంకర్లకు శుభప్రదం. ప్రత్యేకతను నిలుపుకోలేనివారు తాత్కాలికంగా అనుకరించినా అభ్యంతరముండదు. మంచి పద్ధతులు అనుకరణీయమే కదా! ఈమె ప్రస్తుతం అనేక ఛానెల్సులోనూ, వేదికలపైనా కూడా యాంకర్‌గా కనిపిస్తోంది.

**ప్రభాకర్**: ఈటివిలో 'విధి' సీరియల్‌లో ఓ ముఖ్యపాత్రలో కనిపించి విశిష్టమూ, విలక్షణమూ ఐన నటనతో ఆకట్టుకున్న ప్రభాకర్ క్రమంగా ఈటివిలో చాలా ఎత్తుకి ఎదిగాడు. పద్మవ్యూహం సీరియల్‌లో ఎనభైఏళ్ల వృద్ధపాత్రలో అపూర్వంగా జీవించి- ఈడుకి మించిన పాత్రల్ని ఒప్పించడంలో పెరుమాళ్లు, గుమ్మడి లాంటి మహానటుల్ని తలపించాడు. అతడిలో గొప్ప సృజనాత్మకత కూడా ఉంది. అతడు నిర్వహించిన యాహూ రియాల్టీ షో అపూర్వం. అతడు ఈటివిలో ఉండగా ప్రారంభమైన మహిళలు మహరాణులు (ఇప్పటి స్టార్ మహిళ వంటిదే), స్టార్‌వార్స్ (ఇప్పటి ఢీ వంటిదే), సూపర్ డూపర్ (తర్వాత వచ్చిన మహా మహా మాస్ వంటిది), స్టైల్ రాజా స్టైల్ వగైరా ఎన్నో కార్యక్రమాలు విజయవంతమై- అతడు ఈటివినుంచి తప్పుకోగానే ఆగిపోవడం- ఆయా కార్యక్రమాల సృష్టిలో అతడి పాలు కూడా ఉందా అనుకునేలా చేస్తుంది. చాలా కార్యక్రమాలు ఇంచుమించు అదే థీమ్, యాంకర్లతో తిరిగి ప్రారంభం కావడం గమనార్హం. ప్రభాకర్ ప్రతిభని టివి ఛానెల్స్ సక్రమంగా ఉపయోగించుకోవాల్సి ఉంది. ఐతే- ఛానెల్స్ ఇచ్చిన అవకాశాన్ని- ఉద్వాసనకు దారి తీసే స్థాయిలో ఉపయోగించుకొనడం- యాంకర్సుకీ శ్రేయస్కరం కాదు. ప్రభాకర్ ఉదంతం యాంకర్సుకి ఓ హెచ్చరిక. ఎదుగుదలలో అదృష్ట దురదృష్టాల ప్రభావమూ ఉంటుందని సూచన.